క్లుప్తంగా

మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి పూజలు



మక్తల్: రాష్ట్ర క్రీడల శాఖ, పశుసంవర్ధక శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో వాకిటి శ్రీహరి దంపతులకు ప్రభుత్వం క్వార్టర్స్ కేటాయించగా మంత్రి గురువారం కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గృహ ప్రవేశం చేయగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు అక్కడికి వెళ్లి మంత్రి వాకిటి శ్రీహరిని సన్మానించారు. మక్తల్ నియోజకవర్గం నుంచి మక్తల్, మాగనూర్, కృష్ణ, అమరచింత, ఆత్మకూర్, ఊట్కూర్, నర్వ మండలాల నుంచి నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు.

మంత్రి వాకిటి శ్రీహరికి సన్మానం

నర్వ: రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వాకిటి శ్రీహరిని మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని మంత్రి పదవి కేటాయించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ తదితరులున్నారు.

'ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు'

మరికల్: కాంగ్రెస్ ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్ అన్నారు. మరికల్‌లో గురువారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను కైవసం చేసుకున్నేందుకు పార్టీ ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ తుంగల్లో తొక్కిందన్నారు. ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

బీజేపీ మండల నూతన కమిటీ ఎన్నిక

మరికల్: భారతీయ జనతాతా పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరికల్ బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడిగా వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా రాధా, ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులు, కుర్మన్న ప్రధాన కార్యదర్శులుగా రమేష్, సురేందర్‌గౌడ్, కోశాధికారిగా అశోక్‌గౌడ్, కార్యదర్శులుగా స్వతి, దేవేందర్‌గౌడ్, చంద్రమ్మ, రఘుగౌడ్‌లతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి ఉమేష్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

బీంపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

కోస్గి (మద్దూరు): మున్సిపాలిటీ పరిధిలోని బీంపూర్ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన హన్మంతు, సంజీవ్, అనిల్, లాలప్ప, వెంకటప్ప, గంగప్ప, నరేష్, వెంకటేష్, ఆశప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పుర కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. బీంపూర్ గేటు నుంచి గ్రామంలోకి వెళ్లడానికి ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డు గుంతల మయంగా మారిందని చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా తమ సమస్యను అర్థం చేసుకొని బీటీ రోడ్డు వేయాలని కోరారు.

చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నారాయణపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు విద్య బోధన చేస్తారని తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని బీజేపీ మండల అధ్యక్షురాలు జ్యోతి సాయిబన్న అన్నారు. మండలంలోని భైరంకొండ గ్రామంలో గురువారం అంగన్‌వాడీ చిన్నారులతో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఅంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పిల్లలకు విద్యబోధన చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వివరాలు అందించాలి

నర్వ: వానాకాలంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన దాన్యం వివరాలను అందించాలని పీఏసీఎస్ సీఈఓ ఉదయ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం అయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 5 సీజన్‌లలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం ఇతరత్రా వివరాలు అందించాలని కోరారు.

బడుల్లో విద్యార్థుల సందడి

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం బడులు తెరచుకోవడంతో విద్యార్థులు బడిబాట పట్టారు.



దామరగిద్దలో విద్యార్థులకు స్కూల్ కిట్లను అందజేస్తున్న నాయకులు

- కొత్తపల్లి మండల పరిధిలోని భూనీడు ఉన్నత పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు తరగతి గదుల్లో కేరింతలు వేసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవరెడ్డి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.
- మాగనూర్ మండల వ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభ వేడకలను కనుల పండువగా నిర్వహించారు. బడికి వచ్చిన విద్యార్థులకు రెండు జతల దుస్తులతో పాటు, పాఠ్యపుస్తకాలుఅందజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్‌కుమార్, ఉపాధ్యాయులు రామ్మోహన్, సౌమ్య , దుబ్బన్న, శ్రీనివాసులు, రత్నమ్మ, శ్రీవాణి, బలరాం పాల్గొన్నారు.
- దామరగిద్ద మండలంలోని దామరగిద్ద, కాన్‌కుర్తి, మొగుల్‌మడ్క, క్యాతన్‌పల్లి, కంసాన్‌పల్లి తదితర అన్ని గ్రామాల్లో జెడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, పాఠశాలలు తెరచుకోగా విద్యార్థులు బడిబాట పట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, చందుజమాన్ పాల్గొన్నారు.
- ఊట్కూరు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఘనంగా పునఃప్రారంభమయ్యాయి. బడిబాట కార్యక్రమంలో నమోదు చేసుకున్న విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు. ఉర్దూ మీడియం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సలాం, సీఆర్పీ బీమన్న, ఉపాధ్యాయులు జరీనాబేగం, జావీద్ పాల్గొన్నారు.
- నర్వ మండలంలోని ఉందేకోడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. మొదటి రోజే ప్రతి విద్యార్థికి స్కూల్ కిట్లు అందించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుందని ఉపాధ్యాయులు తెలిపారు.
- కోస్గి మండలం మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి కోరారు.



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఊట్కూరు ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు



కాన్‌కుర్తిలోని పాఠశాలలో విద్యార్థుల సందడి

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నానాయక్

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నానాయక్ అన్నారు. గురువారం మక్తల్ మండలం ఖానాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తును ఎంట్రీ చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు ఉన్న వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే కొన్నేళ్ల నుంచి ఉన్న భూ సమస్యలను పూర్తి స్థాయిలో విచారించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీశ్ కుమార్, ఆర్‌ఐ భూపాల్‌రెడ్డి, డీటీఓ శ్రీలత పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు చక్కటి వేదికలని కోస్గి , గుండుమాల్ మండల తహసీల్దార్‌లు బక్క శ్రీనివాసులు , భాస్కర స్వామి అన్నారు. గురువారం మండలాల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించగా పోతిరెడ్డిపల్లి , చెన్నారం గ్రామాలలో 17 ఫిర్యాదులు అలాగే బలుబద్రాయపల్లి గ్రామంలో 8 ఫిర్యాదులు అందాయన్నారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నిరాహార దీక్షను విజయవంతం చేయాలి

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలో ప్రజా వైద్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న నిర్వహించనున్న నిరాహార దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ కోరారు. నిరాహార దీక్ష స్థలాన్ని గురువారం రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, రతంగ్ పాండు రెడ్డితో కలిసి పరిశీలించారు. నిరాహార దీక్ష సత్యనారాయణ స్వామి చౌరస్తాలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని దీక్షలో పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



దీక్ష స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

దామరగిద్ద: జిల్లాలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం చేపట్టనున్న 24 గంటల నిరవధిక దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, అశోక్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి మెడికల్ కళాశాలకు తరలించడంతో జిల్లా వాసులకు సరైన వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొందన్నారు. దీక్షలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

జింక పిల్లను కాపాడిన రైతులు



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ శివారు పొలాల్లో జింక పిల్లను కుక్కలు తరుముతుండగా రైతులు కుక్కలను తరిమి జింకపిల్లను కాపాడారు. అనంతరం దానిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జింక పిల్లను కాపాడి తీసుకొచ్చిన రైతులను అభినందించి జింక పిల్లను ఫారెస్టు అధికారులకు అందించారు.

బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేత

కొత్తపల్లి: మండల పరిధిలోని దుప్పడి గట్టు గ్రామానికి చెందిన హరిజన్ సాయప్ప ఊపిరితిత్తుల సమస్యతో నిమ్స్ హస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో బాధితుడు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ. 2.75 లక్షలు మంజూరు చేసింది. గురువారం అందుకు సంబంధించిన ఎల్వోసీని కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి తన నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మట్టిని వదలని అక్రమార్కులు



ధన్వాడ పెద్ద చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు



మట్టి తరలింపును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

- యథేచ్ఛగా ఒండ్రు మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- తవ్వకాలు నిలిపివేయాలని గ్రామస్తుల నిరసన

ధన్వాడ: మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. ఇటుక బట్టీలకు అక్రమంగా ఒండ్రు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు తమ పొలాలకు మట్టిని తరలించాలంటే ఇరిగేషన్ అధికారులతో అనుమతి తీసుకొని తరలించాల్సి ఉంటుంది. కానీ ధన్వాడ మండల కేంద్రంలోని పెద్ద చెరువులోని ఒండ్రు మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. అక్రమార్కులు పక్కా ప్రణాళిక ప్రకారం నామమాత్రంగా అనుమతి తీసుకొని పెద్ద మొత్తంలో మట్టిని ఇటుక బట్టీలకు సరఫరా చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో హిటాచీలు, జేసీబీలు ఏర్పాటు చేసి దాదాపు 500 ట్రిప్పులకు పైనే ఒండ్రు మట్టిని తరలిస్తూ చెరువును నాశనం చేస్తున్నారు. కేవలం 5 అడుగుల వరకే మట్టిని తవ్వాల్సి ఉండగా అంతకు మించి తవ్వకాలు జరుపుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో అధికార పార్టీకి చెందిన వారు ఉన్నారని అందుకే ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతుల పొలాలకు తరలించాలి

ప్రభుత్వం ఉచితంగా తమ పొలాలకు మట్టిని తరలించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఒండ్రు మట్టిలో పోషకాలు అధికంగా ఉండడం వల్ల పొలంలో సేంద్రియ శాతం పెరిగి పంట దిగుబడి బాగా వస్తుందని రైతన్నలు పేర్కొంటున్నారు. గతంలో ప్రభుత్వమే రూ.10 లక్షలు ఖర్చు చేసి జేసీబీలను ఏర్పాటు చేసి మట్టిని ఉచితంగా అందించిందని ఈ ఏడాది కూడా ఒండ్రు మట్టిని ఉచితంగా పొలాలకు తరలిస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నదాతలు చెబుతున్నారు.

మట్టి తరలింపు నిలిపివేయాలి



ఒండ్రు మట్టిని ఇటుక బట్టీలకు తరలించి కొంత మంది దళారులు జేబులు నింపుకుంటున్నారు. అధికారులు పరిశీలించి వెంటనే ఒండ్రు మట్టి తవ్వకాలను నిలిపివేయాలి. అదే ఒండ్రు మట్టిని రైతులకు అందిస్తే పంటలు బాగా పండి లాభాలు అయినా పొందుతారు.

– ఇర్ఫాన్, ధన్వాడ

చర్యలు తీసుకుంటాం

ధన్వాడ పెద్ద చెరువు నుంచి మట్టి తరలించేందుకు గుత్తేదారులు రూ.50వేలు డీడీ కట్టారు. ఒక్క టిప్పరుకు రూ.750 చొప్పున 66 ట్రిప్పులకు చలానా కట్టి మట్టిని తరలించారు. అయితే అనుమతులు తీసుకున్నా దానికంటే అధికంగా మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. పరిశీలించి గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం.

– బ్రహ్మానందం, జిల్లా ఇరిగేషన్ అధికారి

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



వర్కూర్ పాఠశాలలో విద్యార్థుల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

మాగనూర్: విద్యార్థులు చట్టాలపై అవగహన పెంచుకోవాలని పారా లీగల్ వలంటీర్ హాజమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వర్కూర్ మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. అలాగే రాజ్యాంగం తమ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలకు దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మాగనూర్: రైతులు, మత్స్యకారులు పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మాగనూర్ మండల మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు అన్నారు. స్థానిక లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఆవరణలో పీఎం కిసాన్ కారు ఉపయోగాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా మత్స్య శాఖ సంఘం అధ్యక్షుడు కాంతకుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, ఎల్‌డీఎం విజ యేకుమార్ పాల్గొని మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.2లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మరికల్: నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు కోరారు. మరికల్‌లో గురువారం టీయూసీఐ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం రూపొందించిన నాలుగు లేబర్ యాక్ట్‌లకు వ్యతిరేకంగా ఈనెల 15 నుంచి రెండు రోజుల పాటు మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభలో రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి



మద్దూరులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న పుర కమిషనర్, సిబ్బంది

కోస్గి (మద్దూరు):మద్దూరు మున్సిపాలిటీలోని ప్రజలు ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని పుర కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. ప్రభుత్వం మున్సిపాలిటీల్లో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 11వ రోజు గురువారం మద్దూరు పట్టణంలోని బాపన్‌గేరిలో తడి, పొడి చెత్త, అలాగే పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం వల్ల తడి చెత్తతో ఎరువులను తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పుర సిబ్బంది రామునాయక్, వెంకటయ్య, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని 16వ వార్డులో ర్యాలీ నిర్వహించి తడి–పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్,హెల్త్ అసిస్టెంట్ మొహిన్‌బాషా,మెప్మాసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం



నారాయణపేటలో ప్రచార రథం..



ధన్వాడలో..

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని మండల విద్యాధికారి బాలాజీ అన్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బడి ప్రచార రథం గురువారం నారాయణపేట మండలంలో పర్యటించింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరుస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సర్కారు బడులను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాకా రవికుమార్, లింబ్యా నాయక్, భాగ్యరాజ్, వెంకట్రాములు పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని స్థానిక సీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందుజమాన్ అన్నారు. దాతలు అందించిన పుస్తకాలు, దుస్తులను గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల మరమ్మతు పనులకు దాత వన్నాడ వెంకటప్ప రూ.50 వేలు విరాళమందించగా పనులు చేపట్టినట్లు తెలిపారు.

కోస్గి (మద్దూరు): ప్రభుత్వ బడుల్లోనే పిల్లలకు సంపూర్ణ వికాసం సాధ్యమని ఎంఈఓ బాలకిష్టప్ప అన్నారు. గురువారం పెదిరిపాడ్ గ్రామంలో బడిబాట ప్రచారం రథం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విశాలమైన తరగతి గదులు, అన్ని మౌలిక సదుపాయాలతో బడులను తీర్చిదిద్దామని, తల్లిదండ్రులు డబ్బుల వృథా చేసుకోకుండా తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని సూచించారు.

మరికల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసమే తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 'బడిబాట రథం' కార్యక్రమం చేపట్టినట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహ అన్నారు. గురువారం మండలంలోని అప్పంపల్లి, మరికల్‌కు బడిబాట రథం చేరుకోవడంతో రథానికి ఎంఈఓ మనోరంజని, హెచ్‌ఎం నాగరత్నమ్మలతో పాటు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు.

ధన్వాడ: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ గాయత్రి అన్నారు. ధన్వాడ మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం 'బడిబాట ప్రచార రథం' నిర్వహించి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు.

కొత్తపల్లి: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆర్థిక భారం తగ్గించుకోవాలని ఎంఈఓ ఆంజనేయులు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రమాదాలకు నిలయంగా వర్కూర్ క్రాస్ రోడ్డు



మాగనూర్: మండల కేంద్రంలోని వర్కూర్ క్రాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎన్‌హెచ్–167 రహదారి విస్తరణ పనులో భాగంగా గ్రామంలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో గమనించి ముందుకు వెళ్లేలోపు ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు సూచిక బోర్డులు పెట్టినా వాహనాలు వేగంగా వస్తుండడంతో అవి కనిపించపోవడంతో ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు వేయడంతో పాటు కూడలి వద్ద జిగ్‌జాగ్ లేదా వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.